వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం




సమావేశానికి హాజరైన మండల స్థాయి, బూత్ స్థాయి కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయించండి
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఓటరు నమోదు ప్రక్రియ తొలిమెట్టు. క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ మండల, బూత్ స్థాయి కన్వీనర్లు, కో–కన్వీనర్లు, ఏజెంట్లు సైనికుల్లా పని చేయాలి. మీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ మండల స్థాయి బూత్ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, బూత్ స్థాయి కన్వీనర్లు, బూత్ స్థాయి ఏజెంట్లతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓటరు నమోదు ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 238 బూత్‌లు ఉన్నాయని తెలిపారు. ఈనెలాఖరు నాటికి ప్రతి బూత్ నుంచి కొత్తగా అర్హత పొందిన 50 మందిని ఓటర్లుగా చేర్పించే లక్ష్యంతో పని చేయాలన్నారు. అదే విధంగా ప్రతిపక్ష పార్టీలు చేర్పించే దొంగ ఓట్లపై కూడా దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు బీఎల్‌ఓలు, మండల స్థాయి ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఓటరు నమోదులో అక్రమాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త పడాలన్నారు. కొత్త ఓటర్లను చేర్పించడం, మరణించిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి ఓట్ల తొలగింపు, చిరునామా మార్పు వంటి అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. నూతన ఓటరు జాబితాలో అర్హులందరూ చోటు దక్కించుకునేలా చైతన్యవంతులను చేయాలన్నారు. సాంకేతిక సమస్యలపై ఎప్పటికప్పుడు పార్టీ మండల, నియోజకవర్గ స్థాయి నాయకులను సంప్రదించాలన్నారు. వారి వెంటనే సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై మండల స్థాయిలో ఆయా మండలాల నాయకులు సమావేశాలు ఏర్పాటు చేసుకుని, వేగవంతం చేయాలని ఆదేశించారు. నవంబరు ఆఖరు వరకు ప్రతి ఒక్కరూ చురుగ్గా పని చేయాలని కోరారు. నియోజకవర్గంలో నూతనంగా 10 వేల ఓట్ల నమోదు లక్ష్యంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఓటరు నమోదులో ప్రతి పక్ష పార్టీలు అవకతవకలకు పాల్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మెటీరియల్ పంపిణీ..

ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయ్యే వరకు తరుచుగా సమీక్షలు నిర్వహిస్తూ పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మెరుగైన పనితీరు కనబరుస్తూ బూత్ స్థాయిలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా కీలకంగా మరే పరిస్థితులు ఉంటాయన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ బూత్‌స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించిన మెటీరియల్‌ను పార్టీ మండల స్థాయి, బూత్‌స్థాయి సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పుట్టపర్తి మున్సిపాలిటీకి చెందిన ప్రజా ప్రతినిధులు, ఆరు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, పుట్టపర్తి అర్బన్‌తో పాటు, ఆరు మండలాల పార్టీ పరిశీలకులు, మండల స్థాయి బూత్ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, బూత్ స్థాయి కన్వీనర్లు, బూత్ స్థాయి ఏజెంట్లు, బూత్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా గ్రామాభివృద్ధి



తారు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

నల్లచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో దేశానికే ఆదర్శంగా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బండ్రేపల్లి గ్రామం నుంచి చర్లోపల్లి రిజర్వాయర్ వరకూ రూ.1.42 కోట్లతో 1.78 కి.మీ నూతనంగా నిర్మించిన తారు రోడ్డును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పూజా కార్యక్రమాలు నిర్వహించి, శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కదిరి నియోజకవర్గంలోని ప్రతి సచివాలయ పరిధిలో దాదాపు రూ.కోటి ఖర్చు చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఇచ్చిన మాటకు ప్రకారం దాదాపు 135 గ్రామాలకు అప్రోచ్ రోడ్లను నిర్మించామన్నారు. ఒకప్పుడు గ్రామాల్లో జబ్బుపడితే రోడ్డు సౌకర్యం లేక రోగిని జోలి కట్టి మోసుకెళ్లే వారన్నారు. అయితే జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మారుమూల గ్రామాలకు సైతం రోడ్లను నిర్మించడం జరిగిందన్నారు. అత్యవసర సేవలైన 108 వాహనం ద్వారా ఇంటి వద్ద నుంచే రోగిని ఆసుపత్రికి తరలించే స్థాయికి తీసుకెళ్లామన్నారు. కులం, మతం, వర్గం, పార్టీ అనే భావం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలన్నారు. అలాగే బండ్రేపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించినప్పుడు గ్రామంలో సీసీ రోడ్డు వేయిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.10 లక్షల వ్యయంతో సిమెంట్ కాంక్రీట్ రోడ్డును పూర్తి చేశారు. గ్రామస్తుల సమక్షంలో ఎమ్మెల్యే నూతన రోడ్డును ప్రారంభించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ రమణారెడ్డి, మండల కన్వీనర్ హైదర్‌వలి, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, సర్పంచ్ స్వర్ణలత, సొసైటీ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, డైరెక్టర్ ఆదిమూర్తి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, టెంపుల్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, నాయకులు వై.రమణారెడ్డి, లక్ష్మీపతి యాదవ్, సుధాకర్, చిన్నపరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, మహేష్ రెడ్డి, నరసింహారెడ్డి, రఫీ, ఉత్తన్న, రామాంజనేయులు, పోలీస్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దీపావళి శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి



కదిరి: నియోజకర్గ ప్రజలకు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి శనివారం ఓ ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు కలగాలని, ప్రతి ఇంటా కోటి ఆనంద దీపాలు వెలగాలని ఆకాంక్షించారు. 'చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి, దుష్టశక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక' అని అన్నారు.

అపూర్వ కలయిక.. ఆనందాల వేడుక



గురువులతో పూర్వ విద్యార్థులు

కదిరి అర్బన్: పట్టణంలోని ఖాద్రీ ఉన్నత పాఠశాలలో 2010–11 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం కాళసముద్రం ఫారెస్ట్ బంగ్లాలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు పాఠశాల కరస్పాండెంట్ వెంకటనారాయణ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కదిరి అర్బన్: తనను ఇస్మాయిల్ అనే వ్యక్తి కత్తితో పొడిచాడంటూ కదిరి పట్టణానికి చెందిన వలీ అనే వ్యక్తి శనివారం రూరల్ మండల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. వలీ అనే వ్యక్తి ఇస్మాయిల్ భార్యకు ఫోన్ చేశాడు. తన భార్యకు ఎందుకు ఫోన్ చేశావంటూ ఇస్మాయిల్ ఆగ్రహంతో ఊగిపోయాడు. కుమ్మరవాండ్లపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద ఉన్న వలీని ఇస్మాయిల్ కత్తితో పొడిచాడు. వలీ ఫిర్యాదు మేరకు ఇస్మాయిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

19న ఉచిత మెగా వైద్య శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా యువర్స్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈనెల 19వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. యురాలజిస్టు, కార్డియాలజిస్టు, ఆర్థోపెడిక్ సర్జన్ తదితర వైద్యనిపుణులు వైద్య శిబిరానికి వస్తున్నట్లు తెలిపారు. యువర్స్ ఫౌండేషన్, కావేరి ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాస్, కార్యదర్శి సుకుమార్, సభ్యులు చాంద్‌బాషా, నాగేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో కండక్టర్ మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్లు (57) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేశ్వర్లు సెలవు తీసుకుని చికిత్స పొందుతున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంత్యక్రియల కోసం తక్షణ సాయం కింద రూ.15 వేలను డీఎం మైనుద్దీన్ అందించారు. వెంకటేశ్వర్లు మృతదేహానికి అసిస్టెంట్ డిపో మేనేజర్ హరిమోహన్, హరిత, అసోసియేషన్ నాయకులు బైరిశెట్టి, ఎన్‌వీ రమణ, శ్రీనివాసులు, గోపాల్‌నాయక్ రవీంద్ర తదితరులు నివాళులర్పించారు.

జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం: అనంతపురంలోని న్యూటౌన్ బాయ్స్ హైస్కూల్‌లో ఈనెల 10వ తేదీన జరిగిన త్రోబాల్ అండర్–17, అండర్–14 పోటీల్లో యశోద పాఠశాల విద్యార్థులు ప్రతిభ సత్తా చాటారని పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్ తెలిపారు. స్థానిక పాఠశాలలో శనివారం విద్యార్థులను అభినందించారు. అండర్–17 విభాగంలో తన్మయిశ్రీ, చరణ్, అండర్–14లో శ్రీవైష్ణవి, హేమశ్రీ, రఘుచందు, ప్రణయ్ అనంతపురం జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

చిన్నారి మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి



చిన్నారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ యలకుంట్ల అమరనాథరెడ్డి కూతురు క్విత్తారెడ్డి (5) మృతదేహానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం నగర శివారులలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ చిన్నారి మృతి చెందింది. మండల వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి శనివారం యలకుంట్ల గ్రామానికి వెళ్లి చిన్నారి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇందులో జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాగముని, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత..

మండలంలోని నెమలివరం గ్రామానికి చెందిన ఈడిగ వీరాంజనేయులు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. శనివారం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి.. బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. గుంతపల్లి గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మురళి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి అండగా నిలుస్తామన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ రాము, కన్వీనర్ కొత్తరంగారెడ్డి

ఎస్‌పీకుంట: మండలంలో ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఈటె రాము, పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ శాఖల కన్వీనర్లతో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కార్యక్రమం విధి, విధానాలపై అవగాహన కల్పించారు. ఈనెల 14వ తేదీన ఎన్.పీ.కుంట–1, 15న ఎన్.పీ.కుంట–2, 17న బలిజపల్లి, 21న ధనియాని చెరువు, 23న వెలిచలమల సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిమ్మారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సుబహాన్, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి, సర్పంచ్ నాగమునీశ్వర నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, షామీర్‌బాషా, శ్రీరాములు, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, ఈశ్వర్ నాయక్, గోవిందునాయక్, నారాయణస్వామి, తిరుమలనాయుడు, శేఖర్‌రెడ్డి, కేశవ, వెంకటనారాయణ రెడ్డి, రామకృష్ణ, చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళాలు



ఆలయానికి రూ.లక్ష విరాళం అందించిన కొండసాని సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం సుబ్బరాయనిపల్లిలో రామాలయ నిర్మాణానికి శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న పురాతన రామాలయాన్ని జీర్ణోద్ధరణ చేసి, నూతన ఆలయాన్ని నిర్మించనున్నారు. ఉద్యోగరీత్యా, వ్యాపార రీత్యా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న గ్రామస్తులను కమిటీ సభ్యులు కలిసి రామాలయ నిర్మాణానికి విరాళాలు అందజేయాలని కోరారు. పుట్టపర్తిలో ఉన్న కొండసాని సురేష్‌రెడ్డి దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆలయంలో కొబ్బరి కాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఇక పామిడిలో మండల విద్యాధికారిగా ఉన్న గాంగేనాయక్ కుమారుడు జయానాయక్, ఆయన అన్న ఆర్టీసీ జిల్లా కార్యాలయంలో పని చేస్తున్న శ్రీరాంనాయక్ తండ్రి పేరు మీద రూ.50 వేలు అందజేశారు. అదే విధంగా గ్రామంలో పలువురు కలిసి రూ.5 వేలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం మత్తులో వృద్ధుడి ఆత్మహత్య



పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లికి చెందిన పెద్దింటి నరసింహులు (65) శనివారం సాయంత్రం మద్యం మత్తులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు అతడ్ని కిందకి దించి సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు.

అబుల్ కలామ్ ఆజాద్‌కు నివాళి



కదిరిలోని ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పట్టణంలోని ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని ఆజాద్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబహాన్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు మదన్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షానవాజ్, కాంగ్రెస్ నాయకులు ఇందాదుల్లాఖాన్, నాగభూషణం పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని గ్రంథాలయ శాఖలో శనివారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి బొజ్జే నాయక్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



తంగేడుకుంట పంచాయతీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన దృశ్యం

ఓడీచెరువు: మండల పరిధిలోని తంగేడుకుంట పంచాయతీలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ అబిదాభాను, ఎంపీటీసీ వెంకటరమణ ప్రారంభించారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో రూ.1.74 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ మండల కన్వీనర్ చింతావెంకటేశ్, రఫీ, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సత్యనారాయణ రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

నల్లచెరువు: మండల పరిధిలోని రాత్నాలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డి (57) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. అలాగే ఇదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ మెంబర్ రామకృష్ణ (65) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గ్రామానికి విచ్చేసి నాయకుల మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, మహేశ్వర, రామలింగారెడ్డి, చంద్రారెడ్డి, మధు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కదిరి అర్బన్: మండల పరిధిలోని బూరుగుపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న వేపరాళ్ల రాజును శనివారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, రాజు మెడికల్ రిపోర్టును పరిశీలించారు. అనంతరం వైద్యానికి రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రకాష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, నాయకుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



గాండ్లపెంటలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు



పుట్టపర్తి శాఖా గ్రంథాలయంలో పోస్టర్లను విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి అంజనేయులు పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి గ్రంథాలయ శాఖ కార్యాయలంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మౌలానా అబుల్ ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రంథాలయ వారోత్సవాలు 14వ తేది బాలల దినోత్సవంతో ప్రారంభం అవుతాయన్నారు. 15వ తేదీ పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, 16వ తేదీ గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు రంగనాథన్, పాతూరి నాగభూషన్, వెంకటరమణయ్య తదితరులను స్మరించుకోవడం, 17వ తేదీ కవి సమ్మేళనం, సెమినార్లు, రచయితల సందేశాలు, 18వ తేదీ పాఠశాల విద్యార్థిని విద్యార్థుల చిత్ర లేఖన, వ్యాసరచన, వక్తృత్వ, క్రిజ్, క్రీడా పోటీలు, 19వతేది దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చ, 20వతేది డిజిటల్ గ్రంథాలయంపై అవగాహన వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలకు విద్యార్థులు, పాఠకులు పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు రామాంజనేయులు, ఉపాధ్యాయులు నాగేంద్ర, పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాయాధికారిణి ఫరియాబాను శనివారం తెలిపారు. ఈ వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక ఎంఈఓ, ఉన్నత పాఠశాల, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కృష్ణానాయక్, శ్రీనివాసులు, హెచ్‌ఎం మధురాంబ, ఉపాధ్యాయులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం



నాటుసారాను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో అక్రమంగా మద్యం విక్రయించినా, రవాణా చేసిన వారిపై జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలతో గత అక్టోబర్ నెలలో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని సెబ్ స్టేషన్ల పరిధిలో దాడులు నిర్వహించారు. అనంతరం నెలల వారీగా వివరాలు వెల్లడించారు. అక్టోబర్ నెలలో నిర్వహించిన దాడుల్లో 504 మద్యం సీసాలు, 28,864 టెట్రాపాకెట్లు, స్వాధీనం చేసుకుని 186 మందిని అరెస్ట్ చేశారు. 43 వాహణాలు సీజ్ చేసి 178 కేసులు నమోదు చేశారు.అలాగే ఇసుక అక్రమ రవాణాలో 31 మందిని అరెస్ట్ చేసి 28 వాహనాలు సీజ్ చేసి, 31 కేసులు నమోదు చేశారు.

కొనసాగుతున్న సెబ్ దాడులు

ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా సెబ్ దాడులు కొనసాగుతున్నాయి. శనివారం తూముకుంట చెక్ పోస్టులో అక్రమంగా తరలిస్తున్న 192 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. హిందూపురంలో 48 కర్ణాటక మద్యం పాకెట్లు, పుట్టపర్తి పరిధిలో 35 పాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కదిరి సెబ్ స్టేషన్ పరిధిలో 140 లీటర్లు, ధర్మవరం సెబ్ పరిధిలో 40 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

పరీక్ష ఫీజు వసూళ్లలో దోపిడీ

బత్తలపల్లి: ప్రభుత్వ నిబంధనలను భేఖాతరు చేస్తూ పదో తరగతి పరీక్ష రుసుమును ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నాయని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గోగుల మూర్తి పేర్కొన్నారు. శనివారం బత్తలపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పదో తరగతి పరీక్ష రుసుం రూ.125 మాత్రమే తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో మాత్రం రూ.800 వరకూ వసూలు చేస్తున్నారన్నారు. దీంతో బడుగు, బలహీన వర్గాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ప్రస్తుత కరువు పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై అనంతపురం జిల్లా డీఈఓ నాగరాజు, పరీక్ష విభాగం అధికారి గోవింద్ నాయక్ దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు వసూలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా కేంద్రాలల్లోని డీఈఓ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో అఖండ భజన



భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్తులు

కదిరి టౌన్: కదిరి దేవాలయ బజార్‌లో ఉన్న శివయ్య సత్రంలో శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ప్రపంచ వ్యాప్త అఖండ భజనలు నిర్వహించారు. పట్టణంలోని పుట్టపర్తి సాయిరాం, షిర్డీ సాయిబాబా భక్తులు పాల్గొని భక్తిగీతాలు ఆలపించారు.

టపాసుల విక్రయ కేంద్రాల పరిశీలన

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని టపాసుల విక్రయ కేంద్రాలను శనివారం ఎస్ఐ వంశీకృష్ణ తనిఖీ చేశారు. విక్రయ కేంద్రాల వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులకు వివరించారు.

32 పీవీసీ పైపుల అపహరణ

కనగానపల్లి: మండలంలోని యలకుంట్లలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 32 పీవీసీ పైపులు అపహరించారు. బాధిత రైతు సురేష్ తెలిపిన మేరకు.. గ్రామ సమీపంలోని వ్యవసాయ కలం (దొడ్డి)లో 60 పీవీసీ పైపులు ఉంచాడు. రాత్రి వేళలలో గుర్తు తెలియని వ్యక్తులు 32 పైపులు ఎత్తుకెళ్లారు. కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.